


# ఆంతరంగికం

రచన: పి. శ్రీనివాసరావు

ఎదురింటి రేడియో వినిపిస్తున్న లతామంగేష్కర్ గానం అతడిని పొగమంచులా ఆవరించుతున్నది. పూర్వకాలంలో కిన్నెరల కంఠాలు ఇంతకంటె మధురంగా, లలితంగా, సమ్మోహనకరంగా వుండేవా అనుకున్నాడు. చల్లని గాలికి సేదదీరుతూ, ఆలోచిస్తున్న అతడికి లీలగా, సున్నితంగా గాలిమీద తరంగాలుగా తేలివస్తున్న ఆసంగీతం ఊహించరాని ఆనందాన్నిస్తున్నది. పరిసరాల్ని మరిచి, మైమరచివున్న అతనిలోని ప్రతి అణువూ ఆ సమయాన కరిగి గానఝురిలో లీనమైపోతోంది. తను ఆ గాయకురాల్ని యెదురుగా కూచోబెట్టుకుని ఆమె గానాన్ని యెటూపోకుండా, ఎవ్వరి కందకుండా నిరోధించి పాడివి పుచ్చుకోవాలి అంటోంది అతని మనసు. హృదయాన్నింతంగా కదిల్చే శక్తి, శాంతిని ప్రసాదించే మార్దవం ఏ ఇతర కళలోనూ లేదేమనుకున్నాడు. ఇలాంటి అమృతమయ సంగీతంలో స్వార్థరహితంగా ఈ గాయకులు ఇతరుల కెంత సుఖాన్నిస్తారు!

అతని ప్రశాంతాన్ని భంగపరుస్తూ "కలవరమాయె మదిలో" అని పాడుతూ మెట్లెక్కుతున్న రంగడుకూడా స్వార్థం లేకుండా ఇతరుల సుఖంకోసం కష్టిస్తాడు. రంగడు భుజంమీద నీటిబిందె పెట్టుకుని గంతులు వేస్తు మెట్లెక్కుతున్నాడు. యెప్పుడూ వచ్చీరాని సంగీతం ఆలాపిస్తుంటాడు ఉత్సాహంతో. జీవితంమీద చిరాకుతో, వైమనస్యంగా, ముఖాలు అస్తమానం ముడుచుకుని నీరసంగా కూర్చునేవాళ్ళలో సహితం జీవితంమీద విరక్తి కలిగిస్తాడు తన అకుంఠిత చైతన్యంతో. వాడి ముఖంమీద విచారరేఖ లెప్పుడూ గోచరించవు. వాడికి బ్రతుకు ఒక ఆటవిడుపు—అందుకు కారణం వాడిలో అప్పుడు తొణికిసలాడే యౌవనమైనా కావచ్చు. జీవితంలో యేలాంటి బాధ్యతలు లేకుండాపోవడమైనా కావచ్చు. రంగడిమీద ఆధారపడి జీవించేవాళ్లెవరూ లేరు. వాడు సర్వకాలాల్లో భయపడుతూ కాపాడుకోవలసిన ఆస్తులూ లేవు.

"రంగడూ! ఇలా రా" అని పిలిచాడు తను.

బిందె దింపివేసి తిరిగి వచ్చాడు గంతులతో. రంగ డెప్పుడు భూమిమీద తిన్నగా నడిచి యెరగడు. గంతులు, లేకపోతే పెద్ద పెద్ద అంగలు. పదిహేడేళ్ళున్నా ఆ వయసుకు మించిన శరీరపుష్టి వాడిలో.

"ఏం పిలిచారయ్యగారూ!" నవ్వుతూ అడిగాడు.

"రెండు ప్లేయర్సు సిగరెట్లు తెచ్చిపెడతావూ?" రెండణా లిచ్చాడు తను.

"వో!" అని గంతులమీద వెళ్ళి తిరిగొచ్చాడు సిగరెట్లతో. "చెయ్యలేను!" అనడు రంగడు యేపని చెప్పినా. అందుకే తనకి రంగడంటే తగని అభిమానం. ముఖ్యంగా వాడి అంతులేని ఉల్లాసం చూస్తే తనకెంతో అభిమానం.

"పాతాళభైరవి చూశావా రంగడూ?"

"నాలుగుసార్లు!"

"అంత బాగుందేం నీకు?"

"భలే బాగుందయ్యగారు. పాటలు చాల బాగున్నయ్!"

"అందుకనే నా వుషారుగా ఆ పాటలు పాడుతున్నావ్!"

అని తను అనే సరికి వాడికి సిగ్గొచ్చేసింది. తలవంచాడు నవ్వుతూ.

"రంగడూ! అన్నం తిందువుగానిరా!" గోపాలంగారు కేక వేసే సరికి "వస్తానండి!" అంటూ రంగడు మేడ మీదికి తుర్రుమన్నాడు.

గోపాలంగారింట్లో రెండేళ్లనుంచీ పని చేస్తున్నాడు రంగడు. పొద్దుటే సిమెంటు ఫేక్టరీ కెళ్తాడు, యింట్లో పనులు చూసిపెట్టి. సాయంత్రం చీకటి పడక ముందే తిరిగి వచ్చి నీళ్లు పోస్తాడు యింట్లో. వుషారుగా వుంటాడుగాని, ఇతరుల విషయంలో యెన్నడూ జోక్యం కలిగించుకోడు. అందరి పట్లా వినయ విధేయలతో ప్రవర్తించడం వాడి నైజం.

గోపాలంగారింట్లో వుండక పూర్వం రంగడు గుంటూరులో క్రిస్టియన్ కాలేజిలో లెక్చరర్ జేమ్సన్ గారింట్లో వుండేవాడని తనతో గోపాలం చెప్పాడు. జేమ్సన్ తనకి కొద్దిగా పరిచయుడే. ఆయన చాల ధర్మపరుడు, సాధు స్వభావుడు. అలాంటి యజమానిని రంగడు యెందుకు వదిలి వచ్చాడో తనకి అర్థం కాని సమస్య ఐంది. యజమానీ, నౌకరూ, యిద్దరూ మంచివాళ్లయినప్పుడు యిలా విచ్ఛిత్తి యెందుకు కలగాలో తనకు బోధపడలేదు. యెలాగైనా కారణం తెలుసుకోవాలని తన కెంతో కుతూహలం.

వొకనాడు తను రంగణ్ణి పిలిచాడు భోజనమయాక. యథాప్రకారంగా సిగరెట్లు తెప్పించుకుని, తాపీగా పొగలు విడుస్తు "భోజనం చేశావా రంగడూ?" అని అడిగాడు.

"ఆఁ" అన్నాడు రంగడు.

"యేం తిన్నావ్‌రా అయితే!"

"బంగాళాదుంపకూర, కందిపచ్చడి, చారు, మజ్జిగ!"

"భేష్! నా హోటలు భోజనంకన్నా నీపనే సుఖంగా వుంది. అయితే నిన్ను గోపాలంగారు బాగా మేపుతున్నారు!" నవ్వాడు తను.

"ఆయన మహారాజండి! నన్ను కుటుంబంలో వొకవాడిలాగ చూస్తున్నారు!"

"అయితే జేమ్సన్‌గారు యిలాగే చూసేవారా?"

ఆ ప్రశ్న వింటూనే రంగడి ముఖకవళిక హఠాత్తుగా మారిందని తనకి బాగా జ్ఞాపకం. తన ముఖం వేపు వొక క్షణం తేరిపార చూచి, "చిన్నప్పటినుంచీ ఆయన చేతుల్లో పెరిగా ననుకోండి! జేమ్సన్‌గారు నన్ను స్వంత బిడ్డలా ప్రేమించేవారు!" అన్నాడు వుద్వేగంతో.

"మరి ఆయన దగ్గర్నుంచి యెందుకొచ్చేశావ్?"

"అదంతా యిప్పుడెందుకు లెండి!" రంగడు నిట్టూర్చాడు.

"అదికాదు రంగడూ! అంత ప్రీతిగా పెంచిన ఆయనని వదలి పెట్టి యెందుకొచ్చావో తెలుసుకోవాలనుంది నాకు. యేం జరిగింది అసలు?"

"ఈరోజు కాదు. మళ్లీ చెబుతాలే అయ్యగారూ!"

అంటూ నిష్క్రమించాడు రంగడు, మళ్లీ యేం ప్రశ్నలు వస్తాయో అన్న భయంతో.

రంగడు వూహ తెలియని బాలుడుగా వున్నప్పుడు వాడిని జేమ్సన్‌గారు చేరదీశారు. ఆయన క్రైస్తవమత సూత్రాల్ని తు.చ తప్పకుండా అవలంబించేవాడు. అపారమైన భూతదయ ఆయనకి. అందుకే అనాథుడుగా వున్న రంగణ్ణి తన సంరక్షణలోకి తీసుకున్నాడు. రంగడు గొల్ల లబ్బాయి. అయినా వాడిని తన మతంలో చేర్చేందుకాయనే ప్రయత్నం చేయలేదు. ఇతర మతస్థులమీద తన మత భావాలు రుద్దడం అక్రమమని ఆయన సిద్ధాంతం. జ్ఞానం వచ్చాక కూడ రంగడి మత స్వాతంత్ర్యాన్ని జేమ్సన్ యెన్నడూ అవరోధించలేదు.

రంగడికి జేమ్సన్‌గారంటే పితృసమానుడు. వో మారు జేమ్సన్‌గారు వాడిని బొంబాయిలో ఆయన కూతురు దగ్గరకు పంపించితే, నాలుగు రోజుల తర్వాత చెప్పకుండా గుంటూరుకి చక్కా వచ్చేశాడట! అలా చేసినందుకు జేమ్సన్‌గారు వాడిని పల్లెత్తు మాటనలేదు. యెందుకో వాళ్లిద్దరికీ తెలుసు!

జేమ్సన్‌కు రంగడిమీదున్న వాత్సల్యానికి మరోనిదర్శనం వాడు తనతో చెప్పాడు. వొకమారు జేమ్సన్ యింట్లో యేదో వెండి గ్లాసు మాయమైందిట! దొంగ యెవరైనదీ అంతు బట్టలేదు. రంగడి మీద వాడి యజమానికున్న అభిమానాన్ని చూచి కళ్లు కుట్టినవాళ్లు "ఇంటి దొంగ నీశ్వరుడైనా పట్ట లేడన్నట్టు మీ రంగడే ఆ గ్లాసుని 'కాస్తా' తెగనమ్మాడేమో!" అన్నారు. జేమ్సన్ ఆ మాటల్ని చెవిని బెట్టలేదు. రంగడిమీద అలాంటి అభాండాలు పడడం యిష్టంలేక ఆయనా ప్రస్తావనే మరి చెయ్యలేదు యింట్లో. "అంతా దైవకృప!" అని వూరుకున్నాడట!

ఇన్ని చెప్పినా రంగడు అసలు వుదంతం తన దగ్గర దాచాడు. యెంత ప్రయత్నించినా ఆ విషయం మాత్రం చెప్పాడుగాడు. వొకనాడు తను మరీ బలవంతం చెయ్యగా, తన మీద, రెండోసారి

బొంబాయి వెళ్లినప్పుడు, యేదో అపనింద వేయబడిందని మాత్రం చెప్పాడు. ఆ అపనింద యేమిటో, యెందుకు వచ్చిందో మాత్రం చెప్పలేదు. వాడినుంచి ఆ విషయం రాబట్టే ఆశని తనిక వదులుకున్నాడు. జేమ్‌సన్ ద్వారానే ఆ వృదంతం తెలుసుకోవాలని నిర్ణయించుకున్నాడు.

* * * * *

వొకనాడు అతను గుంటూరు వెళ్లాడు. వెళ్లి పని గట్టుకుని క్రిస్టియన్ కాలేజికెళ్లి జేమ్‌సన్‌ని కలుసుకున్నాడు. ఇద్దరూ కాఫీ ముగించి పార్కులోనికి వెళ్లారు. ప్రపంచ పారాయణ మయాక తను రంగడి విషయం ప్రసంగంలోకి తెచ్చాడు.

“రంగడు మా యింటి పక్కనే వున్న గోపాలంగారింట్లో వున్నాడని తెలుసా మీకు?”

“యే రంగడూ?” అని సాలోచనగా తనవేపు చూచి “వోహో! వాడా!” అని నిట్టూర్చాడు జేమ్‌సన్. ఆయన హృదయంలో యేవో పాత స్మృతులు కదిలిన సూచనగా ముఖ కవళిక మారింది.

“రంగడు క్షేమంగా వున్నాడా?” అని అడిగాడు కొన్ని క్షణాల పిదప.

“గోపాలంగారు వాణ్ని చాలావాత్సల్యంతోనే చూచుకుంటున్నారు!”

“పోనీలెండి! యెక్కడో ఒకచోట సుఖంగా వున్నాడుగా! అంతేచాలు!”

తను అడగదలుచుకున్న ముఖ్యమైన ప్రశ్న అప్పుడు వదిలాడు. “జేమ్‌సన్ గారూ! వొక విషయం అడగాలనివుంది మీ మనసుకి కష్టంగా వుండకుండావుంటే”

“దానికేం! అడగండి!”

“రంగడు అన్నేళ్ళుగా మీ దగ్గరే పెరిగి యెందుకు వెళ్ళిపోయాడండీ? యేమైనా అల్లరిచిల్లరి పనులు చేశాడా?”

“రంగడలాంటివాడు కాదండీ! చాల బుద్ధిమంతుడు!” అన్నాడు జేమ్‌సన్ గద్గదికంతో.

“వాడిని మీరే పంపించివేశారా లేక తనంతటే ఇల్లు వదిలిపెట్టి పోయాడా?”

“నా బిడ్డలా పెంచుకున్న వాడిని నేనింటినుంచి పంపించివేస్తానా? వాడిమీద వొక నింద వచ్చింది. అందుకని చెప్పకుండా ఇల్లు వదిలిపెట్టాడు!” జేమ్‌సన్‌గారా మాటలు విచారస్వరంతో చెబుతుంటే తనకు జాలివేసింది. ఆయన మమకారం ఆశ్చర్యం కలిగించింది.

“అపనిందా? రంగడిమీదనా?”

“అవును. రంగడిమీద నిందవచ్చింది. అది పెద్ద గాథ. చెబుతా వినండి. బొంబాయిలో వుంటున్న మా అమ్మాయి రంగడిని పంపమంటూ వ్రాసింది. పగలల్లా తన భర్త ఆఫీసులోనేవుండటంవల్ల వొంటరిగా ఇంట్లో వుండటం తనకి భయంగా వుందనీ, ఏపని ఐనా చేసిపెట్టే వాళ్ళెవరూ లేరని అన్నదామె ఉత్తరంలో. నాకంతఇష్టంలేకున్నా రంగడిని బొంబాయి పంపాను. పంపిన వారం రోజులకే మా అల్లుడు నన్ను తక్షణం రమ్మంటూ వ్రాశాడు. వెళ్ళాను. యేముంది? అల్లుడు రంగడిమీద నిప్పులు గక్కుతున్నాడు. కూతురు ఏడుస్తూ కూచునివుంది. సంగతేమిటని అడిగితే రంగడు ఒకరోజు అమ్మాయి దగ్గర యేదో పిచ్చివేషం వెయ్యబోయాడట! అల్లుడిని శాంతపరిచి, రంగడికి తగిన

శిక్ష విధిస్తానని కూతుర్ని సమాధాన పరిచి రంగడితో తిరిగి వచ్చేశాను గుంటూరికి. నాకేమీ అర్థంకాలేదు. రంగ డలాంటి పని చేయడని నా అంతరాత్మ ఘోషించింది. అయితే కూతురు అబద్ధమాడటం గాని, వొకరిమీద అన్యాయంగా నింద వేసే స్వభావం కలదిగాదు. దోషి ఎవరో నా కిప్పటికీ తెలియదు. యదార్థం ఆ క్రీస్తు ప్రభువుకే తెలియాలి. నిందితుల్ని ఆయనే శిక్షిస్తాడు!"

అంతా విని తను అన్నాడు. "రంగడిని మీరు అడిగి చూశారా?"

"యెందు కడగలేదూ? అడిగితే నేనే పాపం యెరగనంటూ నా కాళ్ల మీద పడ్డాడు. నేను వాణ్ణేమీ అనలేకపోయాను దాంతర్వాత!"

తను యోచనలో పడ్డాడు — కాదు సందిగ్ధంలో పడ్డాడు. జేమ్సన్ చెప్పడం చూస్తే ఆయన కూతురైనా చెడు నడవడిక కలదిగాదు. రంగణ్ణి తను స్వయంగానే చూస్తున్నాడు. వాడిలో తన కొక్క దుర్గుణమైనా కన్పించలేదు. అలాంటి అర్భకుడు తన తండ్రితో సమానుడైన యజమాని కూతురు దగ్గిర "పిచ్చి వేషం" వెయ్యడం నమ్మదగిన విషయంగా తోచలేదు. అయితే దాని ఆంతర్యం యేమిటి? తన బుర్రలో సైకోఅనాలిసిస్ గ్రంథాల పుటలు తిరిగాయి. కారణం స్ఫురించలేదు. సిగరెట్ వెలిగించి, పొగల్ని తిలకిస్తు యోచనలో పడ్డాడు.

తను నెలరోజుల క్రితం చదివిన "ది చైనీస్ రూం" అనే నవల గుర్తుకొచ్చింది. వివియన్ కానెల్ రచించిన ఆ పుస్తకంలోని వో విచిత్ర సంఘటన తను యింకా మరిచిపోలేదు. ఆ కథలోని వొక స్త్రీ తను ప్రేమించిన వ్యక్తి తనకి అలభ్యుడని గ్రహించి, తన తృప్తికోసం అతను తనకు వ్రాసినట్టుగా ప్రేమ లేఖలు సృష్టించి అతని ప్రతిష్ఠను భంగం కలిగిస్తుంది. చివర కతను నిర్దోషి అని ఋజువయ్యాక అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకుంటుంది క్రుంగిన హృదయంతో.

ఆలోచనల కళ్లెంలాగి, సిగరెట్ చటుక్కున పారేసి లేచాడు తను.

Wanted agents for sale of our new design Fountainpens on Rs. 300/- to Rs. 500/- P. M. salary or commission basis. For samples and free terms apply to

Lawrence Brothers ( A. M. T. ) Nagdevi Bombay 3.